క్లుప్తంగా

సీసీరోడ్లు... విగ్రహాల ఏర్పాటు



మాట్లాడుతున్న పుట్ట శైలజ

మంథని: మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం.. మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. దళిత బహుజన వర్గాల కోసం కృషిచేసిన బీహార్ మాజీ సీఎం బిందేశ్వరా ప్రసాద్, మంథని ప్రథమ ఎమ్మెల్యే గులుకోట శ్రీరాములు విగ్రహాల ఏర్పాటుకు కౌన్సిల్ సభ్యుల ఆమోదించినట్లు తెలిపారు. వైస్‌చైర్మన్ ఆరెపల్లి కుమార్, కమిషనర్ శారద, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఎడ్లబండ్ల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న సర్పంచ్ సుజాత

సుల్తానాబాద్‌రూరల్: ఉగాది సందర్భంగా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో ఎడ్లబండి ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ర్యాలీని సర్పంచ్ వీరగొని సుజాత ప్రారంభించారు. స్థానిక దేవాలయాలైన హనుమాన్, శివాలయం, ఇతర ఆలయాల చుట్టూ ఎడ్లబండ్లతో తిరిగారు. భారీసంఖ్యలో గ్రామస్తులు తిలకించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పులి అనూష, సింగిల్‌విండో మాజీ చైర్మన్ వీరగొని రమేశ్, మాజీ ఎంపీటీసీ పులి వెంకటేశం, ఉపసర్పంచ్ మధు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

23వ సారి రక్తదానం



జూలపల్లి: మిషన్‌స్మైల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జూలపల్లి మండలకేంద్రానికి చెందిన గంగిపెల్లి విద్యాసాగర్ గురువారం 23వసారి రక్తదానంచేశారు. భగత్‌సింగ్ రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సందర్భంగా కరీంనగర్ ప్రభుత్వాస్పత్రిలో మిషన్‌స్మైల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన మిషన్‌స్మైల్ సభ్యులను ఒకటో డివిజన్ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్, నేషనల్ యూత్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ యాదవ రాజు అభినందించారు.

పంటల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న ఏవో శ్రీకాంత్

రామగిరి: మండలంలోని బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన అకాల వర్షానికి దెబ్బతిన్న అరటి తోటలు, వరి, మొక్కజొన్న, కూరగాయల సాగు పంటలను గురువారం ఏవో శ్రీకాంత్ పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనవేస్తున్నట్లు తెలిపారు. ఏఈవో మౌనిక, హార్టికల్చర్ శాస్త్రవేత్తలు శ్రీకాంత్, ప్రీతం, కాంగ్రెస్ మండలఅధ్యక్షుడు బాలాజీ ఉన్నారు.

శివాలయం ఏర్పాటుకు పూజలు



ఓదెల:మండలంలోని కొలనూర్ గ్రామంలో రూ.48 లక్షలతో ఊరచెరువు సమీపంలో శివాలయం ఏర్పాటుకు శంకుస్థాపన, పున:నిర్మాణం పూజలు జరిగాయి. పురాతన ఆలయమైన శివాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరడంతో ఆధునీకరణ ప్రాసిస్త పద్ధతుల్లో నిర్మిస్తున్నట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. ప్రత్యేకపూజలు చేసి శివలింగం ఏర్పాటు చేశారు. హోమం కాల్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. యాంసాని రమాదేవి మోహన్‌ల ఆధ్వర్యంలో అన్నదానంచేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఓదెల జెడ్పీటీసీ గంట రాములుయాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, ఆలయ చైర్మన్ కలకొండ చిన్నరాజిరెడ్డి, సర్పంచ్ సామ మణెమ్మ, ఎంపీటీసీ కారెంగల శ్రీనివాస్, ఉపసర్పంచు పాకాల సంపత్‌రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

25న ఆలయజీర్ణోద్ధరణ

సుల్తానాబాద్: ఈనెల 25న ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పురాతన శివాలయం కమిటీ చైర్మన్ నగునూరి అశోక్‌కుమార్ అన్నారు. గురువారం సుల్తానాబాద్ పట్టణంలోని పురాతన శివాలయంలో ఆలయం శిథిలావస్థకు చేరడంతో ఆలయ జీర్ణోద్ధారణ కార్యక్రమానికి ప్రజలు పూనుకున్నారని ఈనెల 25న శనివారం నుంచి జీర్ణోధారణ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

'డబుల్' ఎంపికపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సర్పంచులు, ఎంపీటీసీలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలో డబుల్‌బెడ్రూంల ఎంపిక ప్రక్రియపై సర్పంచులు, ఎంపీటీసీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం లబ్ధిదారుల ఎంపిక జాబితాపై ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు ఎంపిక జాబితా అయోమయంగా ఉందన్నారు. డబుల్ బెడ్రూం ఎంపిక ప్రక్రియలో అనేక కొర్రీలు పెడుతూ, అర్హత లేదంటూ దరఖాస్తులు తిరస్కరించడంపై అధికార ప్రతిపక్ష ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలకేంద్రంలోని పాండవుల గుట్టవద్ద 240 డబుల్‌బెడ్రూంలు నిర్మించారన్నారు. లబ్ధిదారుల ఎంపికలో మండలంలోని 24 జీపీల నుంచి 1654 మంది దరఖాస్తు వచ్చాయన్నారు. రెవెన్యూ అధికారులు దరఖాస్తులు పరిశీలించి వీరిలో నిబంధనల ప్రకారం 160 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించి జాబితా ప్రకటించారన్నారు. మరో 80 ఇళ్లు కేటాయించేందుకు అర్హులు లేరంటూ తహసీల్దార్ అనుపమరావు తెలిపారు. దీనిపై అధికార ప్రతిపక్ష సర్పంచులు ఎంపీటీసీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయమై తహసీల్దార్ అనుపమరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశానుసారం సమగ్ర సర్వే నిర్వహించి జాబితా ప్రకారం లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేశామన్నారు. డబుల్‌బెడ్రూం ఎంపికలో దరఖాస్తు చేసుకున్న వారి కుటుంబ సభ్యుల్లో ఎవరి పేరుపైనైనా కరెంట్ మీటరున్నా, ఫోర్‌వీలర్, ట్రాక్టర్, కారు, వ్యవసాయభూమి ఉన్నా, ప్లాటు ఉన్నా డబుల్‌బెడ్రూం ఎంపికకు అనర్హులని పేర్కొన్నారు. ఇలాగైతే గ్రామాల్లో తమపై వ్యతిరేకత వస్తుందని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు వాపోయారు. సమావేశంలో ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అంతా మోసం

గోదావరిఖని: డబుల్‌బెడ్రూం ఇళ్ల ప్రక్రియ అంతా మోసమని వైఎస్సార్‌టీపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి జిమ్మిబాబు విమర్శించారు. లబ్ధిదారులను రోడ్డుపాలు చేయకుండా 160 మందికి ఇళ్లు కేటాయించాల్సిందేనన్నారు. ఎమ్మెల్యే కోరుకంటి చందర్ స్థానికులను మోసం చేస్తున్నాడన్నారు. గతంలో ఎంపిక చేసిన 160 మంది లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించిన తర్వాతే మిగిలిన వారికి కేటాయించాలని డిమాండ్‌చేశారు.

'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోవాలి



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్

యైటింక్లయిన్‌కాలనీ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'కంటివెలుగు' కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రామగుండం కార్పొరేషన్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ నారాయణరావు అన్నారు. గురువారం యైటింక్లయిన్‌కాలనీ 16వ డివిజన్‌లో 'కంటివెలుగు' కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటి సమస్యతో బాధపడుతున్న వారు పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఉచితంగా కంటి అద్దాలతో పాటు మందులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ మండల కిషన్‌రెడ్డి, అల్లూరు యూపీహెచ్‌సీ డాక్టర్ నీలిమ, సానిటరీ సూపర్‌వైజర్ అడప సోమేశ్, హెల్త్‌సూపర్‌వైజర్ సీతారామయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో 'కంటివెలుగు' వైద్య పరీక్షలు

జూలపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లె, తేలుకుంట గ్రామాల్లో గురువారం కంటివెలుగు వైద్య పరీక్షలకు అనూహ్య స్పందన లభించింది. వెంకట్రావుపల్లెలో 143 మందికి కంటిపరీక్షలు చేసి 36 మందికి, తేలుకుంటలో 156 మందికి పరీక్షలు చేసి 17 మందికి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి, రత్నాకర్, సీహెచ్‌వో ఖలీమొద్దీన్, హెచ్‌వీ వసంత, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

ఎలిగేడు: 'కంటివెలుగు' వైద్యశిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి నిస్సీక్రిస్టీనా తెలిపారు. శివుపల్లిలో నిర్వహించిన వైద్యశిబిరంలో 132 మందికి కంటి పరీక్షలు చేసి 44 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. సర్పంచ్ దుగ్యాల శ్వేత, ఎంపీటీసీ తూడి లక్ష్మీ, ఉపసర్పంచ్ వంగ అజయ్‌గౌడ్, క్యాంపు మెడికల్ ఆఫీసర్ స్వప్న, ఆర్.అఖిల, వైద్యసిబ్బంది, నాయకులు దుగ్యాల సంతోష్‌రావు, పంచాయతీ కార్యదర్శి, వార్డుసభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ వర్ధంతి సభ



మంథనిలో నివాళులర్పిస్తున్న యూత్‌నాయకులు

జ్యోతినగర్: ఇందిరమ్మకాలనీ శివారు ప్రభుత్వ భూముల్లో ఇళ్ల స్థలాల పోరాట శిబిరం వద్ద సర్దార్ భగత్‌సింగ్ వర్ధంతి సభ నిర్వహించారు. గురువారం రామగుండం కార్పొరేషన్ రెండోడివిజన్ ఇందిరమ్మ కాలనీలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.భిక్షపతి భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళుర్పించారు. ఇళ్లస్థలాల పోరాటాన్ని భగత్‌సింగ్ స్ఫూర్తితో కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇళ్లస్థలాల పోరాటంను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని, నిస్వార్థంతో, నిజమైన పేదలకు ఇళ్ల స్థలాలు చెందేలా పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు. స్వార్థప్రయోజనాల కోసం ఆరాటపడుతున్న వారు తమ వైఖరి మార్చుకుని ఈ పోరాటానికి సహకరించాలని కోరారు. గీట్ల లక్ష్మారెడ్డి అధ్యతన నిర్వహించిన సమావేశంలో ఎం.రామాచారి, నాగలక్ష్మి,ఉపేందర్,రమణ,రవీందర్,మల్లేశ్‌పాల్గొన్నారు

మంథని: స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్‌సింగ్ వర్ధంతిని మంథనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్ల నాగరాజు, టౌన్ అధ్యక్షుడు రాజు, బీసీసెల్ మంథని డివిజన్ అధ్యక్షుడు గోటికార్ కిషన్, నాయకులు దొరగార్ల శ్రీనివాస్, ఎరుకల మధు, మంథని సురేశ్, బండారి ప్రసాద్ ఉన్నారు.

బీ–గెస్ట్‌హౌస్‌ను ఐటీపార్కుకు కేటాయించొద్దు



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి బీ–గెస్టుహౌజ్ ఐటీ పార్కుకు కేటాయించొద్దని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ అన్నారు. పార్కు కోసం ప్రభుత్వం మరో భవనం చూసుకోవాలని డిమాండ్ చేశారు. గోదావరిఖనిలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెందిన ఆస్తులను అధికార దర్పంతో కబ్జా చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికే కంపెనీకి చెందిన క్వార్టర్లను, స్కూల్ బిల్డింగ్‌లను వివిధ అవసరాల కోసం వాడుకుంటోందని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే సింగరేణి అధికారులకు మాయ మాటలు చెప్పి, పర్మిషన్ తీసుకొని బీ–గెస్టుహౌస్‌లో పని చేసే కాంట్రాక్టు కార్మికులు రోడ్డున పడే పరిస్థితి తీసుకువచ్చారని అన్నారు. గెస్టుహౌస్‌ను ఐటీ పార్కుకు ఇవ్వడం వల్ల అధికారులు, యూనియన్ సమావేశాల్లో పాల్గొనే నాయకులు విశ్రాంతి తీసుకునేందుకు ఇబ్బందులు ఏర్పడతాయని పేర్కొన్నారు. గెస్టుహౌస్‌ను తీసుకునే ఆలోచనన విరమించుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ఎంఏ గౌస్, పడాల కనకరాజు, చెప్యాల భాస్కర్, రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

రామగిరి: మండలంలోని లొంకకేసారంలో రామగిరి ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఓదెలు ఉపాధ్యాయులు చంద్రశేఖర్, శృతి తదితరులు పాల్గొన్నారు.

ధర్మారంలో అక్రమ నిర్మాణం కూల్చివేత



అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న సిబ్బంది

ధర్మారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న ఇంటిని పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం కూల్చివేశారు. వివరాల్లోకి వెళ్తే.. ధర్మారం గ్రామానికి చెందిన అల్కా సుధాకర్‌కు 2014లో అధికారులు సర్వేనంబర్ 476 ప్రభుత్వ భూమిలో ఇంటి నిర్మాణానికి గుంటన్నర స్థలంకేటాయించి, పట్టా ఇచ్చారు. అయితే సదరు భూమిని ఇదే గ్రామానికి చెందిన దేవి నళినీకాంత్ నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసినట్లు తెలిసింది. ప్రభుత్వ భూమిని విక్రయించిన సుధాకర్ ఐదేళ్ల క్రితం మృతిచెందాడు. ఈ క్రమంలో నళినీకాంత్ ఆస్థలంలో ఇంటి నిర్మాణ పనులు చేపట్టారు. కాగా ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇల్లు నిర్మిస్తున్నాడని స్థానికులు తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శిలకు ఫిర్యాదు చేశారు. దీంతో జీపీ కార్యదర్శి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది నిర్మాణం వద్దకు చేరుకొని, కూల్చివేశారు. అక్కడున్న సామగ్రిని పంచాయతీ కార్యాలయానికి తరలించారు. ప్రభుత్వం తమకు కేటాయించిన ఇంటి స్థలంలో నళినీకాంత్ అక్రమంగా ఇంటి నిర్మాణం చేస్తున్నాడని సుధాకర్ భార్య పుష్పలత ఫిర్యాదు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

వైభవంగా శ్రీఆదివరాహస్వామి మాస కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కమాన్‌పూర్: కమాన్‌పూర్ మండలకేంద్రంలో ప్రసిద్ధి చెందిన శ్రీఆదివరాహస్వామి మాస కల్యాణాన్ని గురువారం ఆలయ ప్రధాన అర్చకులు కలకుంట్ల ప్రసాదాచార్యుల బృందంతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏటా ఉగాదిరోజు స్వామివారి ఉత్సవాలు నిర్వహించి.. మరుసటి రోజు మాస కల్యాణం జరిపిస్తారు. ఆలయ చైర్మన్ ఇనగంటి ప్రేమలత, ఈవో కాంతారెడ్డి, డైరెక్టర్లు పిడుగు అంజి, దండె కనుకరత్నం, భూపెల్లి జ్యోతి, కొలిపాక లక్ష్మి పాల్గొన్నారు. నేడు స్వామి వారి హుండీల ఆదాయాన్ని లెక్కించనున్నట్లు ఈవో తెలిపారు.

శ్రీదేవి వసంత నవరాత్రి ఉత్సవాలు

సుల్తానాబాద్: మండలకేంద్రంలోని సాంబశివాలయంలో శ్రీదేవి వసంత నవరాత్రులు ప్రారంభమయ్యాయి గురువారం మొదటిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మహిళలు ఒడిబియ్యం సమర్పించారు. మొదటి రోజు శ్రీశైల పుత్రి అవతారంలో దర్శనమివ్వగా అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం హాజరైన వారికి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో పూజారి రమేశ్, మహిళలు పాల్గొన్నారు.

సింహద్వారం ఏర్పాటుకు భూమి పూజ

రామగుండం: అబాది రామగుండంలోని ప్రసిద్ధ శ్రీ కాశీ విశ్వేశ్వరాలయ గర్భాలయ ప్రవేశ ద్వారంతో పాటు ప్రధాన ద్వారాల ఏర్పాటుకు గురువారం విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్మాణానికి సహకరించిన దాతలతో పాటు అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ పూజారి బుగ్గ శ్రీనివాస్ శర్మ, ఆలయకమిటీ ప్రతినిధులు ఉన్నారు.

గర్భిణులకు సీమంతం

రామగుండం: అంతర్గాం మండలపరిధి ముర్మూర్ గ్రామంలోని ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పలువురు నిరుపేద గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేశారు.నూతన వస్త్రాలు సమర్పించి స్వీట్లు తినిపించారు. ఈ వేడుకల్లో అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకురాలు పెండ్యాల విమలమ్మ, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

సీపీఎం జనచైతన్య పోస్టర్ ఆవిష్కరణ

రామగుండం: ఈనెల 25న గోదావరిఖనిలో జరిగే సీపీఎం జనచైతన్య యాత్రను విజయవంతం చేయాలని పార్టీ ప్రతినిధి అడారి నర్సింగరావు కోరారు. ఈమేరకు గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు తూడూరి శ్రీనివాస్‌గౌడ్, మార్త పోశం, ఆషాడ మల్లయ్య, మాలెం సురేశ్, చిత్తారి మల్లేశ్, దొంతుల పోశం, సతీశ్ ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం చందనాపూర్‌లోని ఒకటో వార్డు ఏరియాలో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను సర్పంచ్ దాసరి శంకరయ్య గురువారం ప్రారంభించి మాట్లాడారు. జెడ్పీచైర్మన్ పుట్ట మధు చొరవతో రూ.10 లక్షల సీఎస్సార్ నిధులు మంజూరయ్యాయని వాటితో సీసీరోడ్డు పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి సహకరించిన జెడ్పీచైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ సుకన్య, ఉపసర్పంచ్ సాగర్‌రావు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయాలి

రామగిరి: ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు మంచిర్యాలలో నిర్వహించే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఎఫ్‌టీయూ నాయకులు సుద్దాల అశోక్, సత్తిబాబు కోరారు. గురువారం ఆర్జీ–3 పరిధిలోని గనుల్లో కాంట్రాక్టు కార్మికులతో కలిసి పోస్టర్ అవిష్కరించారు.

శోభారాణికి డాక్టరేట్ ప్రదానం



ఓదెల: ఉస్మానియా విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగంలో పరిశోధకురాలిగా పనిచేస్తున్న ఓదెల మండలం కొలనూర్ గ్రామానికి చెందిన దొడ్డె శోభారాణికి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఉస్మానియా విశ్వవిద్యాలయం అదనపు పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ సీపీ వర్ధిని గురువారం ప్రకటించారు. వరంగల్ జిల్లాలో వితంతువులు సమస్యలను తట్టుకుని జీవించేందుకు అనుసరిస్తున్న విధానాలు అనే అంశంపై ఉస్మానియా యూనివర్శిటీ రోడామిస్త్రీ కాలేజ్ ఆఫ్ సోషల్‌వర్క్ , హైదరాబాద్ రిటైర్డ్ రీడర్ డాక్టర్ హన్నా ఆనంద్‌రాజ్ పర్యవేక్షణలో దొడ్డె శోభారాణి పరిశోధన పూర్తిచేశారు. ఈ సందర్భంగా శోభారాణిని కొలనూర్ గ్రామస్తులు, ఆత్మీయులు, పరిశోధకులు, బంధుమిత్రులు విద్యార్థులు అభినందించి హర్షం వ్యక్తంచేశారు.

మధుసూదనాచారికి ఉగాది పురస్కారం



ఉగాది పురస్కారం అందుకుంటున్న అర్చకుడు

గోదావరిఖనిటౌన్: స్థానిక కోదండ రామాలయం ప్రధాన అర్చకుడు గోవర్ధనగిరి మధుసూదనాచార్యులకు ఉగాది సందర్భంగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో బుధవారం రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన శోభకృత్ నామ ఉగాది పురస్కారాలను దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా శాలువాలతో సన్మానించి, ఉగాది పురస్కారం అందించారు. పురస్కారం అందుకోవడంపై కోదండ రామాలయం ఈవో శంకరయ్య, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్, అర్చకులు గోవర్ధనగిరి గిరిధరాచార్యులు, శశిధరాచార్యులు, సిబ్బంది అశోక్, వేణుగోపాల్, అర్చకులు హర్షం వ్యక్తం చేశారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారమివ్వండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్: జిల్లాలో కురిసిన అకాలవర్షాలు, వడగండ్ల వానలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పార్టీశ్రేణులతో కలసి కలెక్టర్ సంగీతకు వినతిపత్రం అందించారు. మొక్కజొన్న, వరి, మిరప,పండ్లతోటలు అకాలవర్షాలతో నష్టపోయాయన్నారు. ఇప్పటికీ సంబంధిత వ్యవసాయాధికారులు పంటనష్టం అంచనా వేసేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించలేదని ఆరోపించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో అన్నదాతలకు ఫసల్‌బీమా యోజన పథకం అమలుచేస్తే రైతులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని విస్మరిస్తోందన్నారు. పంటనష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చూడాలని కోరారు. నాయకులు శ్రీనివాసరావు, సమ్మయ్య, తూడి రవీందర్, తిరుపతి, శంకర్, కుమార్, నాగరాజు, సదయ్య, సతీశ్, శ్రీనివాస్ గౌడ్, సుధాకర్, సంతోష్ తదితరులున్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీసీపీ వైభవ్‌గైక్వాడ్

గోదావరిఖని/జ్యోతినగర్/సుల్తానాబాద్‌రూరల్: పండుగలు కులమతాలకు అతీతంగా ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని పెద్దపల్లి డీసీపీ వైభవ్‌గైక్వాడ్ సూచించారు. గురువారం గోదావరిఖని వన్‌టౌన్‌లో హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలతో నిర్వహించిన శాంతికమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాబోయే రంజాన్, శ్రీరామనవమి, హనుమాన్ వేడుకలను కులమతాలకు అతీతంగా జరుపుకుని పోలీసులకు సహకరించాలన్నారు. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో రామగుండం సీఐ చంద్రశేఖర్ గౌడ్, సుల్తానాబాద్ పోలీసుస్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశాన్ని సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించి మాట్లాడారు. దేవాలయాలు, మజీద్‌లు, పట్టణ వార్డుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన



కాగడాల ప్రదర్శనలో పీడీఎస్‌యూ నాయకులు

గోదావరిఖని/రామగుండం: భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్ వర్ధంతి సందర్భంగా గురువారం ప్రధాన చౌరస్తాలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ఐఎఫ్‌టీయూ యూనియన్ కార్యాలయం నుంచి ప్రధానచౌరస్తా వరకు కాగడాల ర్యాలీ నిర్వహించారు. అంతర్గాం మండలకేంద్రంలో పీడీఎస్‌యూ, పీవైఎల్ ప్రతినిధులు కాగడాల ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్), పీడీఎస్‌యూ, ఐఎఫ్‌టీయూ నాయకులు కాసిపేట ధర్మేందర్, ఈదునూరి నరేశ్, దుర్గయ్య, కె.మొగిలి, రాజన్న, సీహెచ్. అబేద్నేగో, కె.ఎల్ల య్య రాంకీ, బి.రమేశ్, శ్రావణ్ కొల్లూరి మల్లేశ్, బొంతు ఆనంద్, వేల్పుల సాంబయ్య, ఉప్పులేటి న ర్సయ్య తీగుట్ల నవీన్, తమ్మనవేణి రాజకొముర య్య, శ్రీనివాస్, నాగేశ్వరరావు, నజీరుద్దీన్, దేవ య్య, కొండయ్య, ప్రవీణ్,విజయ్, భగత్‌సింగ్, కాంపెల్లి రవితేజ, హార్థిక్, రితిక్ తదితరులున్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

మంథని: సెర్ప్ ఉద్యోగులకు పేస్కేల్‌వర్తింపజేసినందుకు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గురువారం మంథనిలోని జెడ్పీచైర్మన్ పుట్ట మధు నివాసంలో సెర్ప్ ఉద్యోగులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి సన్మానించారు.

కాల్వశ్రీరాంపూర్: అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ఎకరానికి రూ.5వేలు ఇవ్వనున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంతో సర్వత్రా రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఈ సందర్భంగా కాల్వశ్రీరాంపూర్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి ప్రజాప్రతినిధులు క్షీరాభిషేకం చేశారు. జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, వైస్‌ఎంపీపీ శిరీష, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేసిన వారిలో ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు



ఎన్టీపీసీ పోలీసుల అదుపులో కాంగ్రెస్ నాయకులు



జూలపల్లి పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు

పెద్దపల్లిరూరల్/జూలపల్లి/జ్యోతినగర్/కాల్వశ్రీరాంపూర్/ధర్మారం: ఉమ్మడి జిల్లా పర్యటనకు సీఎం కేసీఆర్ వస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు అడ్డుకుంటారనే అనుమానంతో పెద్దపల్లిలో కాంగ్రెస్ నాయకులను పోలీసులు గురువారం ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. పార్టీ పట్టణఅధ్యక్షుడు సురేశ్‌గౌడ్ నాయకులు జగదీశ్, సునీల్‌గౌడ్, చంద్రశేఖర్, సర్వర్, కౌన్సిలర్లు సంపత్, సుభాశ్‌రావు తదితరులున్నారు. సీఎం కేసీఆర్ చెప్పే మాటలకు చేసే పనులకు పొంతనే ఉండడం లేదని, నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటమాడుతున్నాడన్నా రు. జూలపల్లిలో కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. సీఎం పర్యటనకు అటంకం కలిగించే అవకాశం ఉన్నందున ఠాణాకు తరలించి సాయంత్రం వదిలేశారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకుల అరెస్టులు అక్రమమని ఖండించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి సిట్ నోటీసులు అందించడంతో ఆయనకు మద్దతుగా హైదరాబాద్‌కు వెళతారనే సమాచారంతో ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలువురు కాంగ్రెస్ నాయకులను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీలో కీలకపాత్ర వహించిన వారిని అరెస్టు చేయకుండా రేవంత్‌రెడ్డికి నోటీసులు ఇవ్వడంపై కాంగ్రెస్ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. ముందుస్తు అరెస్టులతో నిజాలను దాచిపెట్టలేరని స్పష్టం చేశారు. కాల్వశ్రీరాంపూర్‌లో కాంగ్రెస్ నాయకులను తెల్లవారు జామున పోలీసులు అరెస్టుచేసి సాయంత్రం వదిలేసినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు.